క్లుప్తంగా

పెద్దమ్మ తల్లికి బోనాలు



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో ముదిరాజ్ కులస్తులు బుధవారం పెద్దమ్మతల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. బోనాలతో వెళ్లి గ్రామంలోని ఆలయంలో సమర్పించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, నాయకులు రాజు, యాదగిరి, సారంగం, సాంబయ్య, నరేశ్, సందీప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో

నర్సంపేట : వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేసిన ఆస్పత్రి లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని వరంగల్ రోడ్డులో బుధవారం ధర్నా నిర్వహించారు. కొమ్మాల సింగ్యాతండాకు చెందిన బానోతు రమ్య పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు తీసుకున్నారు. ఆమె ఈనెల 9న ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశువుకు అంగవైకల్యం ఉడడంతో స్కానింగ్ చేయించినప్పుడు చెప్పలేదంటూ సంబంధిత కుటుంబ సభ్యులు వైద్యురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనా స్థలికి పోలీసులు చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చి రాస్తారోకో విరమింపజేశారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులకు స్వేరోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. అనంతరం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ఉమెన్స్ కమిటీ జిల్లా ఇన్‌చార్జ్ తేజస్విని, జిల్లా అధికారి ప్రతినిధి జయరాజ్ మాట్లాడారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదన్నారు. కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) మేనక, స్వేరోస్ బాధ్యులు జీవన్, జైపాల్, నవీన్, వినోద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ల బహూకరణ

రాయపర్తి : మండలంలోని కొండూరులోని అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక విఘ్నేశ్వర సేవా సంఘం సభ్యులు పంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజు చేతుల మీదుగా బుధవారం ఫ్యాన్లు బహూకరించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు బత్తిని రాజేశ్ మాట్లాడారు. గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గిరగాని వేణు, ఉబ్బని ప్రసాద్, ఉబ్బని నర్సింహ, నేరెల్లి మహేశ్, పంతంగి ప్రకాశ్, పంతంగి యాకయ్య, బొమ్మెర నరేశ్, రామారపు రత్నాకర్, పెండ్లి రవీందర్, గూడెల్లి నరేశ్, దానబోయిన మహేశ్, తొగరి శివకుమార్, గుంటుక మణి తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌ఏ మండల కమిటీ ఎన్నిక



నర్సంపేట : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ చెన్నారావుపేట మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఆ మండల కేంద్రంలో అసోసియేషన్ నర్సంపేట డివిజన్ ఇన్‌చార్జ్ నర్మెట యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరరావు పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలు తెలుసుకోవాలని కోరారు. అధ్యక్షురాలిగా గంగిడి కవిత, ఉపాధ్యక్షుడుగా కత్తి స్వామి, ప్రధాన కార్యదర్శిగా మాదారపు శ్రీను, కన్వీనర్‌గా బండి పద్మ, సమాఖ్య సలహాదార్లుగా ఓరుగంటి కట్టయ్య, మంజుల, గ్రామ కమిటీ అధ్యక్షుడుగా తీగల అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి చిరంజీవి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ..

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో దేవీశరన్నవరాత్రి ఉత్సవ కమిటీ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నాగరాజు, సంతోశ్, అధ్యక్షుడిగా అక్కలి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా మంద రాజు, కార్యదర్శులుగా కత్తుల కుమార్, పెరుమాండ్ల ప్రవీణ్, కోశాధికారులుగా తోట వీరశేఖర్, పెరుమాండ్ల రాజు, ఆర్గనైజర్లుగా మహేశ్, లక్ష్మణ్, ముఖ్య సలహాదారుగా అనిల్, సభ్యులుగా రాజశేఖర్, శ్రీధర్, వెంకటేశ్, రవి, సంతోశ్ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీని గ్రామస్తులు అభినందించారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీ

రాయపర్తి : గ్యాస్ సిలిండర్‌కు లీకేజీ ఏర్పడి స్థానికులను కలవరానికి గురి చేసింది. వివరాలిలా.. మండలంలోని ఏకే తండాకు చెందిన మూడు నర్సింహ నివాసంలోని గ్యాస్ సిలిండర్ బుధవారం లీకైంది. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే సిలిండర్‌ను ఇంటికి సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ ఉపకాల్వలో పడేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

పారిశుద్ధ్య కార్మికుల వేతన వెతలు

● కుటుంబ పోషణలో ఇబ్బందులు

దుగ్గొండి : పారిశుద్ధ్య కార్మికులకు వేతన వెతలు తప్పడం లేదు. ప్రతినెలా వేతనాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా మూడు నెలలుగా వేతనాలు అందని దుస్థితి నెలకొంది. ఈనెలలోనే బతుకమ్మ, వచ్చే నెల 2వ తేదీనే దసరా పండుగ ఉండగా ఆనాటికైనా వేతనాలు అందుతాయా? అని పారిశుద్ధ్య కార్మికులు ఎదురు చూస్తున్నారు.

మండలంలోని గ్రామ పంచాయతీల్లో 112 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. మురికి కాల్వలు శుభ్రం చేయడం నుంచి ప్రజలకు తాగునీటి సరఫరా చేసే వరకు అన్ని పనులూ వీరే చేస్తారు. కంపు కొడుతున్నా రోడ్లపై చెత్తాచెదారాన్ని తొలగిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములవుతున్నారు. అయినా వీరికి నామమాత్రంగా, నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతూ ఇస్తున్న దుస్థితి నెలకొంది. పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.9,500లు మాత్రమే ఇస్తున్న ప్రభుత్వం సకాలంలోనైనా ఇవ్వడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరికి పీఎఫ్, ఇఎస్ఐ లాంటి సౌకర్యాలు, విధుల్లో మృతి చెందితే ఎక్స్‌గ్రేషియా కూడా అమలు కాని దుస్థితి నెలకొంది.



సైడ్ కాల్వలో పూడిక తీస్తున్న కార్మికులు

'010 పద్దు' హుళక్కేనా..!

పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా 010 పద్దు ద్వారా వేతనాలు అందిస్తామన్న ప్రభుత్వ ప్రకటన హుళక్కేనా..! అంటూ పలువురు కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జూలై నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందించకపోవడంతో తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఈనెలలోనే బతుకమ్మ పండుగ, వచ్చే నెల ప్రారంభంలోనే దసరా ఉండగా ఇకనైనా వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే చెల్లించాలి

మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలి. త్వరలో బతుకమ్మ, దసరా పండుగలున్నాయి. ఆలోగా జీతం అందితేనే పండుగ చేసుకుంటాం. లేకుంటే తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వేతనాల బకాయిలు విడుదల చేయాలి.

– పి. రాజేందర్, కార్మికుడు, నాచినపల్లి

అప్పులు తప్పడం లేదు

మాకు ప్రభుత్వం ఇస్తున్న వేతనం సరిపోక కుటుంబ పోషణకు అప్పులు తప్పడం లేదు. కనీసం సకాలంలో అయినా వేతనం ఇస్తే కుటుంబ పోషణ, పిల్లల చదువులు ముందుకు సాగే అవకాశం ఉంటుంది. జూలై నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది అవుతోంది.

– ఎం.రాజు, కార్మికుడు, గిర్నిబావి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈ, తదితరులు

● హౌసింగ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి

ఖానాపురం : ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని హౌసింగ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. ఖానాపురంలో మొదటి దశలో 60 ఇండ్లు మంజూరు కాగా ఇప్పటికే 57 మందికి రూ.లక్ష చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేసినట్టు తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారులు, నాయకులు పర్యవేక్షించి సూచనలు, సలహాలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, ఏఈ నవీన, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్‌రావు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముస్తఫా, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యడ్ల భిక్షంరెడ్డి, నాయకులు సాంబయ్య, శోభన్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



నర్సంపేట : ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, నెక్కొండ, తదితర మండలాల్లో రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



వర్ధన్నపేట : నివాళులర్పిస్తున్న ఎస్సై, తదితరులు



రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



పర్వతగిరిలో..

నియామకం

గీసుకొండ : మున్నూరు కాపు (ఎంకే) సంఘం మండల అధ్యక్షుడిగా మొగిలిచర్లకు చెందిన బెజ్జాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జం రమేశ్ పటేల్ పేర ఉత్తర్వులు బుధవారం అందాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. మండలంలోని మున్నూరు కాపు కులస్తుల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు..

తాళం వేసిన ఇంట్లో చోరీ



పర్వతగిరి : మండలంలోని కల్లెడలో తాళం వేసిన ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా.. గ్రామానికి చెందిన నంపల్లి రంగారావు సింగరేణిలో ఉద్యోగం చేస్తూ గోదావరిఖనిలో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. గ్రామ శివారులోని ముంజాలకుంటతండా రోడ్డుకు ఉన్న అతడి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని ఎల్ఈడీ టీవీతోపాటు సామగ్రి అపహరించారు. ఘటనా స్థలిని ఎస్సై ప్రవీణ్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఇంట్లోని సీసీ పుటేజీని పరిశీలించారు. గేటు, ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడినట్లు గుర్తించారు. ఫింగర్ ప్రింట్స్ నిపుణులు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రాయపర్తి : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. మండలంలోని కొత్తూరు శివారులోని ఆకేరువాగు పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్టు ఆయన చెప్పారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

పర్వతగిరి : మండలం చౌటపల్లిలో అనారోగ్యంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన మట్టపల్లి రజిత తిరుపతిరావు దంపతుల కుమారుడు ముకేశ్‌రావు (22) డిగ్రీ పూర్తి చేశాడు. ఆయన కొంతకాలంగా టీబీతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందాడంటూ ముకేశ్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

‘ఉపాధి’ పనులతో ఆర్థికాభివృద్ధి

● ఎంపీడీఓ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పర్వతగిరి : ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులతో యువత ఆర్థిక అభివృద్ధి సాధిస్తుందని ఎంపీడీఓ శంకర్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో రైతు నాగరాజు ఉపాధి హామీ పథకం కింద నిర్మించుకున్న నాటుకోళ్ల ఫారం షెడ్డును బుధవారం ఎంపీడీఓ ప్రారంభించి మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించేలా పనులు చేపడుతున్నట్టు తెలిపారు. రైతులు, యువత ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఇబ్బంది పడకుండా ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. పథకంలో సుమారు రెండు వందలకుపైగా పనులు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

● సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

నర్సంపేట : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ద్యాగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. మూడేళ్లుగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్నూరి రవి, జీజుల సాగర్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టబోయిన రఘు, నాయకులు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటంలో ఓంకార్ పాత్ర కీలకం



నర్సంపేట : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాగసుధ, నాయకులు

నర్సంపేట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మాజీ ఎమ్మెల్యే, ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ పాత్ర కీలకంగా నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకండ రాజమౌళి తెలిపారు. పట్టణంలోని జ్యోతిబసు నగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల కరపత్రాలను వారు బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. దేశ్‌ముఖ్‌ల ఆగడాలకు వ్యతిరేకంగా ఓంకార్ నాయకత్వంలో రైతాంగ సాయుధ పోరాట దళాలు ప్రజల పక్షాన నిలిచి పోరాడాయని గుర్తు చేశారు. భూస్వాములకు వ్యతిరేకంగా కోయ జనాన్ని ఏకం చేయడంలో ఓంకార్ కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాలను పురస్కరించుకొని తొర్రూరులో ఈనెల 12న 'రైతాంగ సాయుధ పోరాటంలో ఓంకార్ పాత్ర' అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లావణ్య, వెంకన్న, సుశీల, దేవమ్మ, నిర్మల, సర్వర్, రజిత, నీలా, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల పోస్టర్లను మండలంలోని గిర్నిబావిలో ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 12న తొర్రూరులో జరిగే రాష్ట్ర సదస్సుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుసుంబ బాబురావు, బత్తిని కుమారస్వామి, బుడిమె సురేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం సామాజిక బాధ్యత

● ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్



దంపతులను సన్మానిస్తున్న శ్రావణ్, తదితరులు

ఖానాపురం : అవయవదానాన్ని సామాజిక బాధ్యతగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ అభివర్ణించారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన గోవిందు కవిత కుమారస్వామి దంపతులు బుధవారం ముందుకొచ్చి సంబంధిత పత్రాలపై సంతకాలు చేసి ఫౌండేషన్ బాధ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దంపతులను మనుబోతులగడ్డలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. అవయవదానాల్లో దేశంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. అవయవదానంపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు వేణుమాధవ్, శంకర్‌రావు, జిల్లా కోఆర్డినేటర్ దళపతి, నాయకులు చంటి, నాగరాజు, వీరస్వామి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

నల్లబెల్లి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సఖి సెంటర్ కౌన్సిలర్ నూర్జహాన్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో, రేలకుంటలో మహిళా రక్షణ చట్టాలపై బుధవారం నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. మహిళల రక్షణలో సమాజంలోని ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సఖి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆపద సమయాల్లో మహిళలు సఖి కేంద్రాలను ఆశ్రయించి సాయం పొందాలని సూచించారు. సఖి కేంద్రాల్లో లభిస్తున్న సేవలు వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో డీపీఎం దాసు, ఏపీఎం సుధాకర్, సారయ్య, రాజు, కేస్ వర్కర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నెక్కొండ : రేపు (శుక్రవారం) మండలంలోని అలంకానిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆ శాఖ ఏడీఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు అధిక బిల్లులు, ఇతర సమస్యలను వేదిక దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. వినియోగదారులు వేదికను వినియోగించుకోవాలని కోరారు.

క్రాప్ మ్యాపింగ్‌తో రైతులకు మేలు



శిక్షణ కేంద్రం వద్ద వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, తదితరులు

గీసుకొండ : క్రాప్ మ్యాపింగ్‌తో రైతులకు మేలు కలుగుతుందని రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లిలోని శిక్షణ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవగాహన పెంచుకుంటే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. బీసీఐ ఇండియా నుంచి రాజీవ్, కరీంనగర్, ములుగు, నర్సంపేట ప్రాంతాల నుంచి అధికారులు శిక్షణ తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రజ్వల్ సీఈఓ రామ్మూర్తి, ప్రాజెక్టు మేనేజర్ ఇన్నారెడ్డి, టెక్నికల్ కోఆర్డినేటర్ ప్రమోద్, పీయూ మేనేజర్ అయేశ్, మానస, నాగరాజు, శ్రవణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

నర్సంపేట : మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణకు బాటలు పడతాయని యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ స్టేట్ కోఆర్డినేటర్ ఏసుపాదం తెలిపారు. పట్టణానికి చెందిన ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు గోకా రామస్వామికి ఇటీవల అస్సాంలో శాంతిదూత అవార్డు రావడంతో ఆయన్ను బుధవారం ఏసుపాదం అభినందించారు. అనంతరం ఏసుపాదం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వనాల ఏర్పాటుతో ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని తెలిపారు. అనంతరం ఏసుపాదంను రామస్వామి సత్కరించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ రాజగోవింద్, అడ్వైజర్ మెంబర్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

28న ప్రతిభా పురస్కారాలు

ఖిలా వరంగల్ : ఈ నెల 28న హనుమకొండలో పోపా పద్మశాలి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, పురస్కార కన్వీనర్ గోషికొండ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు వరంగల్ శివనగర్‌లోని పోపా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్, నీట్, ఎంసెట్, జేఈఈ, ఐఐటీ తదితర పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులు తమ ర్యాంక్ కార్డు, బయోడేటాను 93901 22559 నంబర్‌కు వాట్సప్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోపా ప్రతినిధులు డాక్టర్ కూరపాటి రమేశ్, గుండు కామేశ్వర్, కోడం ప్రతాప్, పెద్దన్న, రమేశ్, సుధాకర్, మాటేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై ఫిర్యాదు



ఎస్సై గోవర్ధన్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నల్లబెల్లి : మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ కాంగ్రెస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సై గోవర్ధన్‌కు మండలానికి చెందిన గన్నారం అఖిల్ బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడారు. రుద్రగూడెం గ్రామానికి చెందిన సురేశ్, నెక్కొండకు చెందిన చల్లా ప్రవీణ్‌రెడ్డి సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తూ మనోభావాలను దెబ్బతీస్తున్నారని తెలిపారు. దుష్ప్రచారాలు, దూషణలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు.